హైదరాబాద్ వార్త



# చిరుజల్లులతో చల్లబడిన సిటీ

**హైదరాబాద్,జూన్ 6 ప్రభాతవార్త**

నగరంలో ఒక్కసారిగా వెదర్ చేంజ్ అయ్యింది. చిరుజల్లులతో చల్లబడింది. శనివారం ఉదయం నుండి ఎండ దంచికొట్టినప్పటికీ.. సాయంత్రం ఒక్కసారిగా మబ్బులు కమ్మేసి చిరుజల్లులు కురిశాయి. గచ్చిబౌలి, జూబ్లీహిల్స్, ఫిలింనగర్, బోరబండ, యూసుఫ్‌గూడ, ఎస్సార్‌నగర్, సనత్‌నగర్, రాయదుర్గం, హైదర్‌గూడ, కూకట్‌పల్లి, నిజాంపేట, ఉప్పరపల్లి, రాజేంద్రనగర్, గోల్కొండ, ఐటీకారిడార్, ఖైరతాబాద్, కోఠి, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, కోహెడ, తదితర ప్రాంతాల్లో వర్షం కురిసింది. దీంతో రోడ్ల మీద ఉన్న వాహనదారులు చిరుజల్లులతో ఉపశమనం పొందారు. ఈ దెబ్బతో ఉష్ణోగ్రతలు ఒక్కసారిగా తగ్గిపోయి సిటీ చల్లబడింది.



ఆరాంఘర్ నుండి మెహిదీపట్నం వెళ్లే రోడ్డు మార్గంలో వరదనీరు తొలగిస్తున్న రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఎస్‌హెచ్‌ఓ రాజు,సిబ్బంది



# ఈసారి రాత్రి నుండే చేప ప్రసాదం పంపిణీ

**-8వ తేదీ రాత్రి 9 గంటల నుండి మరుసటి రోజు రాత్రి వరకు నిరంతరాయంగా ...**



**గోషామహల్ జూన్ 6 ప్రభాతవార్త**

మృగశిర కార్తె సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి కూడా ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో అస్తమా రోగులకు చేప ప్రసాదాన్ని పంపిణీ చేయడానికి బత్తిని కుటుంబ సభ్యులు అంతా సిద్ధం చేశారు. సాధారణంగా ప్రతి ఏటా మృగశిర కార్తె ఉదయం పూట ప్రవేశిస్తుంది. అయితే ఈసారి జూన్ 8వ తేదీ రాత్రి మృగశిర కార్తె వస్తుండటంతో సోమవారం రాత్రి 9 గంటల నుంచి మరుసటి రోజు (ఈనెల 9వ తేదీ) రాత్రి వరకు కొనసాగుతుందని బత్తిని గౌరిశంకర్ గౌడ్ తెలిపారు. చేప ప్రసాదం తయారీలో భాగంగా ఈ నెల 7వ తేదీన ఉదయం 11 గంటలకు దూద్ బౌలిలోని స్వగృహంలో సత్యనారాయణ స్వామివ్రతం, బావి పూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 8న ఉదయం చేప ప్రసాదాన్ని తయారు చేసిన అనంతరం దూద్ బౌలిలోని స్వగృహంలో కుటుంబ సభ్యులంతా చేప ప్రసాదాన్ని తీసుకున్న అనంతరం ఎగ్జిబిషన్ గ్రౌండ్లో పంపిణీ ప్రారంభమవుతుంది.

## 179 ఏళ్లుగా పంపిణీ...

చేప ప్రసాదానికి 179 ఏళ్ల చరిత్ర ఉంది. ప్రతి ఏడాది పాతబస్తీ దూద్ బౌలిలోని స్వగహంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఇక్కడి బావి నీటితో చేప ప్రసాదాన్ని తయారు చేస్తారు. పూర్వీకుల నుంచి 1996 వరకు పాతబస్తీ దూద్బౌలిలో పంపిణీ జరిగిన చేప ప్రసాదం వివిధ కారణాలతో 2013 నుంచి ఎగ్జిబిషన్ గ్రౌండ్లోనే కొనసాగుతూ వస్తోంది. ప్రసాదం పంపిణీకి తగిన ఏర్పాట్లు చేస్తున్నారు.

### 50 కిలోల నుంచి 5 క్వింటాళ్ల వరకు..

మొదట్లో 50 కిలోల వరకు తయారు చేసిన ఈ చేప ప్రసాదం ప్రస్తుతం 5 క్వింటాళ్లకు చేరిందని అనిరుధ్‌గౌడ్ తెలిపారు. మొదట్లో చేప మందుగా ప్రాచుర్యం పొంది అనంతరం చేప ప్రసాదంగా మారింది. భారత తొలి రాష్ట్రపతి బాబు రాజేంద్రప్రసాద్ సైతం చేప ప్రసాదం కోసం తమ వద్దకు వచ్చారని బత్తిని కుటుంబ సభ్యులు చెబుతున్నారు.

### మూడు రకాల చేప ప్రసాదం...

చేప మందును మూడు రకాలుగా తయారు చేస్తారు. చేపతో ఇచ్చే మందు, బెల్లంతో ఇచ్చే మందు, కార్తె మందు. 2 నుంచి 3 అంగుళాల కొరమీను చేపతో ఇచ్చే ప్రసాదంలు 10 గ్రాములుంటుంది. 30 గ్రాములు కలిగిన కార్తె మందును మూడు డోసులుగా 45 రోజుల పాటు వాడాలి. 15, 30, 45 రోజలలో కార్తె మందును వాడాలి. చేపతో మింగడం ఇష్టం లేని వారికి బెల్లం ప్రసాదాన్ని అందజేస్తారు. నిజానికి చేపతో తీసుకునే ప్రసాదమే ఫలితాలిస్తుందని చెబుతున్నారు. ప్రసాదం స్వీకరించే ముందు రెండు గంటల వరకు ఎలాంటి ఆహార పదార్థాలతో పాటు నీటిని కూడా స్వీకరించకూడదు. ప్రసాదం స్వీకరించిన అనంతరం గంటన్నర వరకు కూడా స్వీకరించకూడదు.

### ఎండ తీవ్రత, ఉక్కపోత దృష్ట్యా ప్రత్యేక వసతులు...

ప్రస్తుతం ఎండలు, ఉక్కపోత ఎక్కువగా ఉన్నందున క్యూలైన్లలో నిల్చునే భక్తులు ఇబ్బంది పడకుండా ఉండేందుకు వీలుగా పెద్దఎత్తున ఫ్యాన్లు, కూలర్లను ఏర్పాటు చేయనున్నారు. నిరంతరం విద్యుత్ సరఫరాకు ఎలాంటి ఆటంకం కలగకుండా చూడాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. అత్యవసర వైద్య సేవల కోసం ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో ప్రత్యేక మెడికల్ క్యాంపులు, మందులు, అంబులెన్సులను సిద్ధంగా ఉంచనున్నారు. ఏదైనా ప్రమాదం జరిగితే తక్షణమే స్పందించేందుకు ఫైర్ ఇంజన్ వాహనాలను కూడా గ్రౌండ్స్‌లో ఉంచనున్నారు.

# భార్యభర్తల్లో విభేదాలు తలెత్తకుండా మెలగాలి : డిజిపి సివి ఆనంద్



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న డిజిపి సీ.వీ.ఆనంద్, చిత్రంలో మల్కాజిగిరి సీపీ సుమతి, జ్యుడిషియల్ అకాడమీ హెడ్ శ్రీదేవి

**కంటోన్మెంట్,జూన్ 6 ప్రభాతవార్త:**

మహిళలు పురుషులతో సమానంగా ఉన్నత చదువుతు చదివి ఉద్యోగాలు చేస్తున్నారు. అందు వల్ల భార్యభర్తలు ఒకరినొకరు అర్థం చేసుకొని వారి సంసార జీవితాన్ని సంతోషంగా, సాఫీగా కొనసాగించాలని రాష్ట్ర డిజిపి సీ.వీ.ఆనంద్ తెలిపారు. మల్కాజిగిరి పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో శనివా రం సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఇంపిరియల్ గార్డెన్‌లో నిర్వహించిన కలిసి ఉంటే కలదు సుఖం మీ సురక్ష అంశంపై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. మహిళల సాధికారత, భద్రతా అభివృద్ధి అంశాలపై రాష్ట్ర వ్యాప్తంగా అనేక కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భార్య భర్తలలో తలెత్తిన విబేదాలు, గొడవలతో పోలీస్ స్టేషన్లలో నిర్వహించిన కౌన్సిలింగ్ తరువాత 150 కపుల్స్ కలిసి ఉండడం సంతోషంగా ఉందన్నారు. భార్య భర్తలే కాకుండా ఇద్దరు వ్యక్తులు కలిసినప్పుడు వారి ఆలోచన విధానంలో కూడా మార్పులు సహజమన్నారు. వివాహాలు గ్రాండ్‌గా జరుపుకుంటాం, కొన్ని రోజుల తరువాత భార్యభర్తల మధ్య మారుతున్న పరిస్థితుల్లో ఇంట్లో గొడవ లు, దంపతుల మధ్య మనస్పర్థాలు సహజమన్నారు. అలాంటి సమయలో ఒకరినొకరు అర్థం చేసుకొ ని ఆవేశాలకు గురి కాకుండా కొంత ఓపిక ఉండాలన్నారు. సిఐడి, ఉమెన్‌సేఫ్టీ వింగ్ డిజిపి చారు సి.న్హా, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతిలు మాట్లాడుతూ సేఫ్ సిటీ అనే ప్రాజెక్ట్ కేంద్ర ప్రభు త్వం 8 సంవత్సరాల క్రితం ప్రారంభించిందన్నారు. మహిళల భద్రత విషయంలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు. 6,700 ఫ్యామిలీలు విడిపోకుండా వారికి కౌన్సిలింగ్ ఇచ్చి ఏకం చేశామన్నా రు. సిటీలో మహిళల భద్రత కోసం 7 మహిళా పోలీస్‌స్టేషన్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో జ్యుడిషియల్ అకాడమీ హెడ్ శ్రీదేవి, ఏసీపీ గోపాల క్రిష్ణమూర్తి, బోయిన్‌పల్లి ఇన్‌స్పెక్టర్ తిరుపతి రాజులతో పాటు వివిధ పోలీస్‌స్టేషన్ల ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

# ఐటి కారిడార్ రేసింగ్‌లపై డ్రోన్లతో నిఘా : మాదాపూర్ డిసిపి రితిరాజ్

**రేసింగ్‌లు చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిపై కేసులు**



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేసింగ్ బైక్‌లను పరిశీలిస్తున్న ద ృశ్యం

**గచ్చిబౌలి, జూన్ 6 ప్రభాతవార్త**

ఐటి కారిడార్‌లో కారు, బైక్ రేసింగ్‌లపై ఉక్కుపాదం మోపుతున్నామని, రేసింగులను కట్టడి చేసేందుకు డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేయనున్నట్లు మాదాపూర్ డిసిపి రితిరాజ్ తెలిపారు. ఐటి కారిడార్ రహదారులపై అర్ధరాత్రి రేసింగ్‌లు, ప్రమాదకర స్కిట్లు చేసి సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్న వారిని గుర్తించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసిపి రితిరాజ్ వివరాలు వెల్లడించారు. మాదాపూర్ ఐటి కారిడార్ పరిధిలోని నాలెడ్జ్ సిటీలో గల నిలోఫర్ కేఫ్, టిహబ్ తదితర రహదారుల మీద వారాంతాల్లో అర్ధరాత్రి ప్రమాదకరంగా రేసింగ్‌లు, బైక్ స్టంట్లు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. కాగా గతకొన్ని నెలల క్రితం ఈ తరహా రేసింగ్‌ల మీద పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి అరెస్టులు చేయడంతో కొన్ని రోజులు సద్దుమణిగింది. ఈ మద్య కాలంలో మరోసారి బైక్, కారు రేసర్లు రెచ్చిపోయి అర్ధరాత్రి తీవ్ర భయాందోళనలు స ృష్టిస్తు న్నారు. సోషల్ మీడియాలో ఒకరినొకరు సంప్రదించుకొని, అర్ధరాత్రి ఒక్కసారిగా ఐటి కారిడార్ రహదారుల మీద ప్రత్యక్షం అవుతున్న రేసర్లు... స్థానికంగా రేసింగ్‌లు, స్కిట్లతో రెచ్చిపోతున్నారు. తాము చేసిన ప్రమాదకర రేసింగ్‌లు, స్కిట్లను సోషల్ మీడియాలో వీడియోలు, ఫోటోలను షేర్ చేస్తున్నారు. ఇటువంటి వారిని గుర్తించి పోలీసులు తాజాగా కేసులు నమోదు చేశారు. మే 24వ తేదీన హోండా కారుతో రేసింగ్‌లకు పాల్పడిన మహ్మద్ రేహాన్(19), ఓవైసీ మోహినోద్దీన్(21), మహ్మద్ ఇఫ్రాన్‌ఖాన్(24)లతో పాటు మరో ఇద్దరు మైనర్ల మీద కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. మే 25వ తేదీన బైక్ స్టంట్లు చేసి సోషల్ మీడియాలో వీడియోలు పోస్టు చేసిన వారిని వీడియోల ఆధారంగా రణవీ ర్‌సింగ్(26), సాయికుమార్‌గౌడ్(23), సలాం కలాం(23), సుంకాని నరేష్(26)లను, మే 28న బైక్ స్టంట్లు చేసిన దండు అకాష్‌లపై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘటనలో ఓ కారు, నాలుగు బైక్‌లను స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు తెలిపారు. కారు, బైక్ రేసింగులు, స్టంట్లతో ప్రజలను భయాందోళనకు గురిచేస్తున్న, ప్రమాదాలకు కారణమవుతున్న రేసర్ల మీద కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. నాలెడ్జ్ సిటీలో ఇకపై డ్రోన్లతో నిఘా ఏర్పాటు చేసి రేసింగ్‌లపై ఆధారాలతో సహా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. నాలెడ్జ్ సిటీలో అర్ధరాత్రి వాహనాల అక్రమ పార్కింగ్ చేపడితే చర్యలు తప్పవని, అనుమతి లేనిచోట పార్కింగ్ చేస్తే వాహనాలను లిఫ్ట్ చేస్తామన్నారు. క్రమం తప్పకుండా తనిఖీలు చేపడుతామని, వాహనదారులు సరైన ధృవపత్రాలను పోలీ సులకు చూపించాలని సూచించారు. బైక్‌లు, కార్లను నిబంధనలకు విరుద్ధంగా మితిమీరిన సౌండ్‌తో ఆల్ట్రేషన్ చేస్తే వాహన యజమాని, మెకానిక్‌ల మీద చర్యలు తప్పవని హెచ్చరించారు.

# దొంగతనం కేసులో ముగ్గురు నిందితులు అరెస్టు

**న-గంజాయి, బంగారు, వెండి, ఆభరణాలు, ల్యాప్‌టాప్, బైక్‌లు స్వాధీనం**



పోలీసులు అదుపులో నిందితులు

**అల్వాల్, జూన్ 6 ప్రభాతవార్త:** ఇంటి తాళాలు పగలు కొట్టి దొంగతనానికి పాల్పడిన ముగ్గురు నిందితులను అల్వాల్ పోలీసులు అరెస్టు చేశారు. ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. గత నెల 29వ తేదీన తుర్కపల్లిలో అర్ధరాత్రి సమయంలో దొంగతనం జరిగింది. 31 తులాలు బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, డెల్ ల్యాప్‌టాప్, యాపిల్ వాచ్ కొంత నగదును దొంగలు దొచుకున్నారు. బాధితుడు పేరక రమేష్ కుమార్ ఫిర్యాదుతో మేరకు అల్వాల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 11 గంటల కు రెడ్డి ఎన్‌క్లేవ్ వద్ద వాహనాలు తనిఖీలు చేస్తున్న క్రమంలో కెటిఎమ్ బైక్‌పై అనుమానా స్పదంగా సంచరిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకోవడం జరిగిం ది. జవహర్‌నగర్‌లో నివాసించే బైక్ మెకానిక్ మహ్మద్ సలీం(19), జవహర్‌నగర్ గబ్బిలాల పేటకు చెందిన జెప్టో డెలివరీ బాయ్ భాను ప్రకాస్(19), జనగాం జిల్లా మహారాజుల కాలనీకి చెందిన భరత్ కుమార్(19)లు దొంగతనానికి పాల్పడినట్లు పోలీసులు విచారణలో తేల్చారు. నిందితులు నుంచి రెండు బంగారు ఉంగరాలు, ఒక వెండి నాణం, డెల్ ల్యాప్ టాప్, ఆపిల్ వాచ్, 2.58 కేజీలు గంజాయి, కెటిఎం మరియు బజాజ్ పల్సర్ బైక్‌లు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మల్కాజిగిరి జోన్ డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ శ్రీధర్, అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీసులు బేగంపేట్ డివిజన్ గోపాల క్రిష్ణమూర్తి పర్యవే క్షణలో అల్వాల్ ఎస్‌హెచ్‌ఓ ప్రశాంత్, డిఐ వీరబాబు, సిసిఎస్ ఇన్‌స్పెక్టర్ నరసింహరావు, హెడ్ కానిస్టేబుల్ జీవన్ కుమార్, సతీష్, రమాకాంత్, అంజనేయులు కేసు చేధనలో కీలకంగా వ్యవహరించారు.

# పాతనగరం అభివృద్ధి కోసం ఎంఐఎం కృషి

**-ఎంపి అసదుద్దీన్ ఓవైసీ**



ఫత్తర్‌గట్టి డివిజన్‌లో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎంపి అసదుద్దీన్ ఓవైసీ

**యాకుత్‌పుర,జూన్ 6 ప్రభాతవార్త :** హైదరాబాద్ పాతనగరం అభివృద్ధి కోసం ఎంఐఎం నిరంతరం కృషి చేస్తున్నదని ఎంఐఎం అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ అన్నారు. చార్మినార్ నియోజకవర్గం, ఫత్తర్‌గట్టి డివిజన్‌పరిధిలో శనివారం దాదాపు మూడు కోట్ల, ఇరవై నాలుగు లక్షల రూపాయలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ ఎమ్మెల్యేనయ మీర్ జుల్ఫికర్ అలీ, మాజీ కార్పొరేటర్ సోహెల్ ఖాద్రితో పాటు పలువురు ఎంఐఎం నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# నిమ్స్‌లో హ్యాండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభం

**- రెండు ఎలక్ట్రానిక్ వాహనాలు అందజేత**



హ్యాండ్ రిహాబిలిటేషన్ క్లినిక్ ప్రారంభోత్సవంలో డాక్టర్ నగరి బీరప్ప, ఎం. సునీత తదితరులు.

**జూబ్లీహిల్స్, జూన్ 6, ప్రభాతవార్తః**

నిమ్స్‌లో ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ విభాగం, ఫిజియోథెరపీ విభాగం సంయుక్త ఆధ్వర్యంలో హ్యాండ్ రిహాబిలిటేషన్ క్లినిక్‌ను ఏర్పాటుచేశారు. ఈ క్లినిక్‌ను నిమ్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎన్. నగరి భీరప్ప, తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యతో కలిసి ప్రారంభించారు. చేతి గాయాలు, నరాలు దెబ్బతినడం, టెండన్ గాయాలు, కాలిన గాయాలు, జన్యుపరమైన లోపాలు, శస్త్రచికిత్సల అనంతరం చేతి పనితీరు కోల్పోయిన రోగులకు ఈ క్లినిక్ ద్వారా సమగ్ర చికిత్స, పునరావాస సేవలు అందించనున్నట్లు డాక్టర్ బీరప్ప తెలిపారు. ప్లాస్టిక్ సర్జన్లు, ఫిజియోథెరపిస్టులు, హ్యాండ్ థెరపిస్టులు సమన్వయంతో పనిచేస్తూ రోగులు త్వరగా సాధారణ జీవనశైలికి తిరిగి చేరుకునేలా ప్రత్యేక సేవలు అందిస్తారన్నారు. ఈ క్లినిక్ ఏర్పాటుకు తెలంగాణ ఫారెస్ట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్య తమ సీఎస్‌ఆర్ కార్యక్రమంలో భాగంగా ఆర్థిక సహకారం అందించారన్నారు. అలాగే నిమ్స్‌కు వచ్చే రోగులు, వారి సహాయకుల రవాణా సౌకర్యార్థం రెండు ఎలక్ట్రిక్ వాహనాలను విరాళంగా అందించారు. హ్యాండ్ రిహాబిలిటేషన్ క్లినిక్‌కు అవసరమైన పరికరాల కొనుగోలుకి రూ.5 లక్షలు, రెండు ఎలక్ట్రిక్ వాహనాలకు రూ.28 లక్షలు మొత్తం రూ. 33 లక్షల విలువ గల సహాయాన్ని నిమ్స్‌కి అందించారు. ఈ క్లినిక్ రాష్ట్రంలోని హ్యాండ్ రిహాబిలిటేషన్ సేవలకు ఒక ప్రత్యేక కేంద్రంగా నిలుస్తుందన్నారు. కార్యక్రమంలో అదనపు ప్రధాన అటవీ సంరక్షణ అధికారి సునీత ఎం. భగవత్, ప్లాస్టిక్ అండ్ రీకన్‌స్ట్రక్టివ్ సర్జరీ విభాగం హెచ్‌ఓడి ప్రొఫెసర్ ఆర్.పార్వతి, సీనియర్ ప్రొఫెసర్ ఆర్. శ్రీకాంత్, ఫిజియోథెరపీ విభాగం వైద్యులు డా. శ్రవణ్, అసిస్టెంట్ మెడికల్ సూపరింటెండెంట్ డా.సల్మాన్, మీడియా రిలేషన్ ఆఫీసర్ సత్యగౌడ్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# నత్త నడకన సాగుతున్న నాలా వంతెన మరమ్మతులు

**-మూడు నెలలు గడుస్తున్నా పనులలో కనిపించని పురోగతి**

**-తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, పాదచారులు**





**ముషీరాబాద్, జూన్ 6, ప్రభాతవార్త:**

అశోక్‌నగర్ నాలా మరమ్మత్తు పనులు నత్త నడకన కొనసాగుతున్నాయి. వర్షాకాలం సమీపించేలోగా పూర్తి చేయాలని ప్రారంభించిన ఈ పనులు మూడు మాసాలు పూర్తి అయినా పనులలో పురోగతి కనిపించకపోవటంతో స్థానిక ప్రజలు, వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడవలసి వస్తోంది. వేసవి పూర్తి అయ్యేలోగా నాలా పనులు పూర్తి కావల్సి ఉండగా, వేసవి పోయి, వర్షాలు కూడా ప్రారంభం అవుతూ ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. పనులు ప్రారంభం: అశోక్‌నగర్ నాలా బ్రిడ్జ్ బలహీనపడి, ప్రమాదకరంగా మారుతున్న నేపథ్యంలో ముందస్తుగా బ్రిడ్జ్‌ని పునరుద్ధరించేందుకు జీహెచ్‌ఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. దాదాపు మూడు కోట్ల వ్యయ అంచనాతో ఫిబ్రవరిలోనే టెండర్ ప్రక్రియ పూర్తి అయినప్పటికీ, ట్రాఫిక్ మళ్లింపులకై, పోలీస్ శాఖ సమన్వయంతో మార్చి 12 నుంచి ఆర్టీసీ క్రాస్ రోడ్సు నుంచి ఇందిరాపార్కు వైపు వెళ్లే వాహనాలను, అశోక్‌నగర్ నుంచి ఇందిరాపార్కు వైపు వెళ్లే వాహనాలను దారి మళ్లించి, బారికేట్లు ఏర్పాటుచేసి, పనులను ప్రారంభించారు. ముందుగా ఒకవైపు బ్రిడ్జ్ మరమ్మత్తు చేసి, అది పూర్తి అయిన తరువాత అటు వాహనాలకు వెసులుబాటు కల్పించి, మరోవైపు పనులు ప్రారంభిస్తామని అధికారులు తెలియచేసినప్పటికీ, మార్చిలో మొదలైన పనులు, జూన్ గడుస్తున్నా ఒకవైపు కూడా పనులు పూర్తి కాకపోవటంతో స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**లోపించిన భద్రతా ఏర్పాట్లు:** అశోక్‌నగర్ బ్రిడ్జ్ సమీపంలో అనేక పాఠశాలలు, ఇందిరాపార్కు, రామకృష్ణ మఠం, ఎన్టీఆర్ స్టేడియం వంటి క్రీడా మైదానాలు, విద్యార్థులు ఉండే పీజీలు, కోచింగ్ సెంటర్‌లు వంటివి ఉండటంతో అనేక మంది విద్యార్థులు, వృద్ధులు, వాహనదారులు నిత్యం ఈ బ్రిడ్జ్ మీదగా తిరుగుతూ ఉంటారు. అంతే కాకుండా ఈ పరిసరాలలో కల్లు కాంపౌండ్, బార్‌లు కూడా ఉండటంతో మద్యప్రియులు సైతం ఇటువైపు ఎక్కువగానే వెళ్తూ ఉంటారు. ఈ పరిస్థితులలో బ్రిడ్జ్ పనులు కొనసాగుతున్న నేపధ్యంలో ప్రమాదవశాత్తూ మద్యం మత్తులో పెద్దలు కానీ, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు కానీ, ఎన్టీఆర్ స్టేడియంలో ఆడుకోవటానికి వెళ్లే పిల్లలు కానీ, ఎవరూ అటువైపు రాకుండా ఉండేందుకు పగులకొట్టిన బ్రిడ్జ్ చుట్టూ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయకపోవటంతో స్థానికులు భయాందోళనలకు గురవుతున్నారు. వర్షాలు పడితే వరదలతో నిండిపోయే హైదరాబాద్ నగర పరిస్థితి అందరికీ తెలిసినదే, ఇటువంటి పరిస్థితులలో వర్షాకాలం సమీపిస్తున్నా, ఇంకా నాలా పనులు మందకొడిగా కొనసాగటం పట్ల స్థానికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పనులు వేగవంతం పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలని, పనులు పూర్తి అయ్యే వరకు ఎటువంటి ప్రమాదాలు జరగకుండా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని కోరుతున్నారు.


# 562 హోటళ్లు, లాడ్జీలలో తనిఖీలు

**- స్వయంగా పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ సజ్జనార్**

**-నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవన్న సీపీ**

**హైదరాబాద్ జూన్ 6 ప్రభాతవార్త**

హైదరాబాద్ నగర అంతర్గత భద్రతను పటిష్టం చేయడంతో పాటు, అసాంఘిక శక్తుల కదలికలను ముందస్తుగా నిరోధించే లక్ష్యంతో రాత్రి 'ఆపరేషన్ కవచ్' తనిఖీలను సిటీ పోలీసులు నిర్వహించారు. శాంతి భద్రతల పరిరరక్షణకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ చేపట్టిన ఈ సోదాలలో సుమారు 5వేల మంది పోలీస్ సిబ్బంది పాల్గొని, 562 హోటళ్లు, లాడ్జీలలో క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. హోటల్ రిజిస్టర్లను క్షుణ్ణంగా తనిఖీ చేయడంతో పాటు, బస చేయడానికి వచ్చిన విజిటర్ల గుర్తింపు కార్డులను నిశితంగా పరిశీలించారు. శుక్రవారం అర్ధరాత్రి 11 గంటల నుంచి శనివారం తెల్లవారుజాము వరకు ఈ సోదాలు కొనసాగాయి. ఈ ఆపరేషన్‌లో నగర పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్ స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనలో పాల్గొన్నారు. నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలోని, అమీర్‌పేటలోని పలు లాడ్జీలను ఆయన స్వయంగా సందర్శించారు. గదుల కేటాయింపు ప్రక్రియ, విజిటర్ల వివరాల నమోదు విధానాన్ని పరిశీలించారు. లాడ్జీలలో బస చేసిన పలువురు విజిటర్లతో నేరుగా మాట్లాడి, ఏ ప్రాంతం నుండి వచ్చారు, నగర సందర్శనకు గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఈ ముమ్మర తనిఖీలలో భాగంగా కమిషనరేట్ పరిధిలోని 7 జోన్లలో మొత్తం 562 హోటళ్లు, లాడ్జీల్లో పోలీసులు సోదాలు నిర్వహించారు. జోన్ల వారీగా తనిఖీలు జరిగిన లాడ్జీలు, హోటళ్ల వివరాలు చూస్తే...అత్యధికంగా ఖైరతాబాద్‌లో 119, శంషాబాద్‌లో 92, జూబ్లీహిల్స్, గోల్కొండలలో 86 చొప్పున, సికింద్రాబాద్‌లో 82, రాజేంద్రనగర్‌లో 53, చార్మినార్ జోన్‌లో 44 చోట్ల ఈ ఆపరేషన్ కొనసాగింది. ఈ తనిఖీల నేపథ్యంలో హోటళ్లు, లాడ్జీల నిర్వాహకులు విధిగా నిబంధనలు పాటించాలని సీపీ సజ్జనర్ స్పష్టం చేశారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టడమే ఈ తనిఖీల ముఖ్య ఉద్దేశమని తెలుపుతూ, లాడ్జికి వచ్చే ప్రతి ఒక్కరి నుండి గుర్తింపు కార్డుల ఒరిజనల్ ప్రతిని పరిశీలించి, దాని స్పష్టమైన నకలును సేకరించాలని ఆదేశించారు. రిజిస్టర్లలో విజిటర్ల పూర్తి సమాచారం, ఫోన్ నంబర్లు, చెక్ ఇన్ , చెక్ అవుట్ సమయాలను ఖచ్చితంగా నమోదు చేయాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పుడు సమాచారంతో గదులను కేటాయించరాదన్నారు. మైనర్లకు ఎట్టి పరిస్థితుల్లోనూ గదులను ఇవ్వొద్దని, గుర్తింపు కార్డుల్లో ఉన్న వయసును ధృవీకరించుకోవాలన్నారు. పెరుగుతున్న సాంకేతికతకు అనుగుణంగా త్వరలోనే నూతన డిజిటల్ విజిటర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను ప్రవేశపెట్టే దిశగా సన్నాహాలు చేస్తున్నట్లు వెల్లడించారు. హోటల్ పరిసరాలలో స్పష్టంగా కనిపించేలా సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఎవరైనా అనుమానాస్పదంగా ప్రవర్తించినా లేదా అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే సూచనలు కనిపించినా వెంటనే దయల్ 100కి గానీ, స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఈ తనిఖీల్లో అదనపు సీపీ క్రైమ్స్ శ్రీనివాసులు, అదనపు సీపీ లా అండ్ ఆర్డర్ తఫ్సీర్ ఇక్బాల్, జాయింట్ సీపీ ట్రాఫిక్ జోయల్ డేవిస్, జాయింట్ సీపీ లా అండ్ ఆర్డర్ నార్త్ జోన్ శ్వేత, డీసీపీ సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ వెంకటేశ్వర్లు, డీసీపీ క్రైమ్స్ చైతన్య కుమార్‌తో పాటు అన్ని జోన్ల డీసీపీలు కిరణ్ ఖరే, శిల్పవల్లి, శ్రీనివాస్, చంద్ర మోహన్, రమణా రెడ్డి, రాజేష్, డీసీపీ సైబర్ క్రైమ్స్ అరవింద్ బాబు, డీసీపీ విమెన్ సేఫ్టీ వింగ్ లావణ్య నాయక్ జాదవ్ తదితరులు పాల్గొన్నారు.





హోటల్ రిజిస్టర్లను పరిశీలిస్తున్న నగర పోలీస్ కమిషనర్ సజ్జనార్

## 18 నుంచి శ్రీవెంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు



పద్మావతి, వెంకటేశ్వరస్వామి, గోదాదేవి అమ్మవారు

**ఎల్.బి.నగర్, జూన్ 6 ప్రభాతవార్త:**
కొత్తపేట సౌభాగ్యపురంకాలనీలోని శ్రీఅలివేలుమంగా పద్మావతి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం పంచదశ వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు దేవాలయం కమిటీ తెలిపింది. 9 రోజులపాటు ఉదయం నుంచి సాయంత్రం వరకు బ్రహ్మోత్సవాలలో భాగంగా పలు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 18వ తేదీ నుంచి 26వ తేదీ వరకు అధ్యాయనోత్సవాలు, 21న శ్రీస్వామివారికి అష్టోత్తర శతకలశ స్థాపనము, సాయంత్రం హంస వాహనోత్సవం, 22న గజారోహణము, సూర్యప్రభ వాహనోత్సవం, చంద్రప్రభ వాహనోత్సవం, 23న హనుమద్వాహనోత్సవం, శేష వాహనోత్సవము, 24న శ్రీస్వామివారికి బ్రహ్మోత్సవ కళ్యాణము, అన్నప్రసాద వితరణ, గరుడ వాహనోత్సవం, 25న కల్పవృక్ష వాహనోత్సవం, గజవాహనోత్సవం, 26న అశ్వవాహనోత్సవము, మహాపూర్ణాహుతి, ధ్వజారోహణ తదితర కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. తొమ్మిది రోజులపాటు దేవాలయంలో జరిగే బ్రహ్మోత్సవాల కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కృపకు పాత్రులు కావాలని వారు విజ్ఞప్తి చేశారు.

## సమస్యలు పరిష్కరించాలని డిసికి వినతి



శ్రీకాంత్‌కు పుష్పగుచ్చాన్ని అందజేస్తున్న గణేష్‌నేత, ఉపేందర్‌రెడ్డి

**ఎల్.బి.నగర్, జూన్ 6 ప్రభాతవార్త:** సరూర్‌నగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్‌గా నూతనంగా భాధ్యతలు స్వీకరించిన శ్రీకాంత్‌ని శ్రీరామ కృష్ణాపురం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పున్న గణేష్‌నేత, యువజన నాయకులు చిలక ఉపేందర్‌రెడ్డిలు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్చం అందించి శాలువతో సత్కరించారు. శ్రీరామకృష్ణాపురం డివిజన్లో ఉన్న సమస్యలను సమస్యలు పరిశీలించి శాశ్వత పరిష్కారం అయ్యే విధంగా చూడాలని వారు ఆయనకు విజ్ఞప్తి చేశారు. పారిశుధ్య నిర్వహణలో స్వీపర్ల సంఖ్యను పెంచాలని కోరారు. అందుకు డిప్యూటీ కమిషనర్ సానుకూలంగా స్పందించి త్వరలో అన్ని సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు గట్ల రవీంద్ర, శ్రీప్రసన్నఆంజనేయస్వామి దేవాలయం చైర్మన్ తలాటి రమేష్‌నేత, శ్రీఖిల్లామైసమ్మ దేవాలయం చైర్మన్ సురేష్‌కుమార్, లింగస్వామిగౌడ్, జెల్లా జగన్నాథం, ఎస్.కె. మహమ్మద్, పగిళ్ల భూపాల్‌రెడ్డి, బొడ్డుపల్లి మహేందర్, నబీ, రఫీ, రామకృష్ణగౌడ్, కిరణ్‌కుమార్, మల్లేష్ యాదవ్, దొర్నాల చంద్రమౌళి, కృష్ణారావు, వెంకటరమణారెడ్డి, ప్రేమ్‌నాయక్, కందుకూరి సుదర్శన్, గుణగంటి రమేష్ గౌడ్ పాల్గొన్నారు.

## పార్టీ కోసం పని చేసే వారికి గుర్తింపు : ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కలిసి సత్కరిస్తున్న బిఆర్‌ఎస్ డివిజన్ ఇంచార్జీ ముశ్యం శ్రీనివాస్ తదితరులు

**ఉప్పల్, జూన్ 6 ప్రభాతవార్త :** బిఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి పనిచేసే వారికే తగు గుర్తింపు ఉంటుందని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం బిఆర్‌ఎస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్‌గా నియమితులైన ముశ్యం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పలువురు నేతలు కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతం, కార్యకర్తల సమన్వయం మరియు ప్రజా సమస్యల పరిష్కారానికి మరింత వేగం చేకూర్చే లక్ష్యంతో ఉప్పల్ డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ ఇంచార్జ్‌గా ముశ్యం శ్రీనివాస్‌ను నియమించినట్లు తెలిపారు. పార్టీ అభివృద్ధికి అంకితభావంతో పనిచేస్తూ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, డివిజన్‌లో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని సూచించారు. డివిజన్ ఇంచార్జ్ ముశ్యం శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై పార్టీ నాయకత్వం ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలు మరియు నాయకత్వం సూచించిన మార్గదర్శకాల మేరకు ప్రజలకు సేవ చేస్తూ, పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు బిఆర్‌ఎస్ పార్టీ నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రత నిబంధనలను ఖచ్చితంగా పాటించాలి

### -ఏసిపి రాజా వెంకటరెడ్డి

**-పలు లాడ్జిలు, హోటల్లో విస్తృతంగా తనిఖీలు**



మలక్ పేటలో లాడ్జిలను తనిఖీలు చేస్తున్న చాదర్‌ఘాట్ ఇన్‌స్పెక్టర్ బ్రహ్మ మురారి తదితరులు

**మలక్ పేట, జూన్ 6, ప్రభాతవార్త:**
భద్రత నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని మలక్ పేట డివిజన్ ఏసిపి రాజా వెంకటరెడ్డి పేర్కొన్నారు. మలక్ పేట డివిజన్ ఏసిపి రాజా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఇన్ స్పెక్టర్లు బ్రహ్మ మురారి, ఉపాశంకర్ తదితరులు ఎస్ ఐలు, సిబ్బంది తో కలిసి మలక్‌పేట్ డివిజన్ పరిధిలోని 13 లాడ్జీలు, హోటళ్లలో భద్రతా చర్యలను మరింత బలోపేతం చేసే లక్ష్యంతో పోలీసులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అతిథుల ఆధార్ కార్డులు, ఇతర గుర్తింపు పత్రాలు, గెస్ట్ రిజిస్టర్లు, సీసీటీవీ కెమెరాల పనితీరు, ఇతర తప్పనిసరి పత్రాలను పరిశీలించారు.హోటల్, లాడ్జి యాజమాన్యాలు అతిథుల పూర్తి వివరాలను తప్పనిసరిగా నమోదు చేయాలని, సీసీటీవీ వ్యవస్థలను నిరంతరం పనిచేసేలా నిర్వహించాలని, అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలపై వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణ మరియు నేరాల నియంత్రణలో భాగంగా ఈ ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.మలక్‌పేట్ ఏసీపీ శ్రీ ఎల్. రాజా వెంకట్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ, మలక్‌పేట్ డివిజన్ పరిధిలోని 13 లాడ్జీలు, హోటళ్లలో తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని, ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# నేడు ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన..!

**-ముస్తాబైన ఉప్పల్ భగాయత్...పోటాపోటీగా ఫ్లెక్సీలు**



ఉప్పల్‌లో ఎంఎంసి భవనం ప్రారంభోత్సవానికి ముస్తాబు అవుతున్న దృశ్యం.





ఉప్పల్ భగాయత్‌లో రహదారులకు తుది మెరుగులు దిద్దుతున్న కార్మికులు దృశ్యం.

**ఉప్పల్, జూన్ 6 ప్రభాతవార్త :** ఉప్పల్ భగాయత్‌లో ఆదివారం సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించనున్న మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయ భవన శంకుస్థాపన కార్యక్రమానికి సర్వంగా సుందరంగా ముస్తాబు చేస్తున్నారు. ఇప్పటికే ఉప్పల్ భగాయత్‌లోని అన్ని రహదారులను శుభ్రం చేసిన అధికారులు, తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టారు. తార్నాక నుంచి ఉప్పల్ చౌరస్తా వరకు, అక్కడి నుంచి నాగోల్ వరకు రహదారులను సర్వంగా సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డితో పలువురు జోనల్ కమిషనర్లు, వివిధ శాఖల అధికారులు ఇప్పటికే ఉప్పల్ భగాయత్‌లోనే తిష్ట వేసి ఏర్పాట్లు పరిశీలిస్తున్నారు. సిఎం కాన్వాయ్ ప్రయాణించే మార్గంలో గుంతల రోడ్లకు మరమ్మతులు చేశారు. తాత్కాలికంగా బిటి రోడ్డు వేశారు. ఉప్పల్ భగాయత్‌లో పేరుకునిపోయిన చెత్తా చెదారం జెసిబిల సహాయంతో తొలగించారు. కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, పలువురు జోనల్ కమిషనర్లు, వివిధ విభాగాధిపతులు, ట్రాఫిక్, శాంతిభద్రతలు, మరియు నీటిపారుదల శాఖ అధికారులతో ఒక సన్నాహక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉప్పల్ భగాయత్‌లో సుమారు పది ఎకరాల స్థలంలో అధునాతన హంగులతో రూ.99 కోట్ల వ్యయంతో భవనం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమానికి సిఎం రేవంత్‌రెడ్డితో సహా పలువురు మంత్రులు, ఇతర అధికారులు పాల్గొంటున్నారని తెలిపారు. కొత్త భవనం నిర్మాణంతో పట్టణ పరిపాలనను మరియు పౌరకేంద్రీకృత సేవల పంపిణీని బలోపేతం చేసే దిశగా ఒక ముఖ్యమైన ముందడుగు పడుతుందన్నారు.

**పోటాపోటీగా ఫ్లెక్సీలు :**
ఉప్పల్‌లో సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నేతలు పోటాపోటీగా ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఉప్పల్, బోడుప్పల్, నాగారం, ఘట్‌కేసర్, ఎల్‌బినగర్‌కు చెందిన పలువురు ప్రజా ప్రతినిధులు ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు ఉప్పల్ నవ నిర్మాణ వేదిక ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి చిత్రపటంతో కూడా ఫ్లెక్సీలు వెలిశాయి. తార్నాక నుంచి ఉప్పల్ భగాయత్ వరకు రహదారులకు ఇరువైపులా నేతల ఫ్లెక్సీలతో హడావిడి నెలకొంది. సిఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఉప్పల్ భగాయత్‌లో వీధిదీపాలు వెలిగిపోతున్నాయి. రోడ్లు సర్వంగా సుందరంగా తయారు అయ్యాయి.

## మల్లికార్జుననగర్ కాలనీ డ్రైనేజీ సమస్యపై ఎంపికి వినతి



మల్లికార్జుననగర్ డ్రైనేజీ సమస్యలపై ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి విన్నవిస్తున్న కాలనీ నేతలు, బిజెపి నాయకులు

**ఉప్పల్, జూన్ 6 ప్రభాతవార్త :** ఉప్పల్ డివిజన్ మల్లికార్జున్ నగర్ డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని కోరుతూ పలువురు కాలనీ వాసులు మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి విన్నవించారు. ఈ మేరకు శనివారం బిజెపి డివిజన్ అధ్యక్షుడు మార్నేని పణీందర్ ఆధ్వర్యంలో కాలనీ సంఘం నేతలు ఎంపి ఈటల రాజేందర్‌ను కలిసి పలు సమస్యలు విన్నవించారు. ఉప్పల్ డివిజన్ మల్లికార్జున నగర్ కాలనీలో పై నుంచి వచ్చే డ్రైనేజీ కారణంగా కింద ఉన్న కాలనీవాసులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. కాలనీలో ఇప్పటి వరకు డ్రైనేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడం వల్ల నిత్యం దుర్గంధంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. దీనిపై ఎంపి ఈటల రాజేందర్ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. దీంతో పాటు నాలా అభివృద్ధి కోసం నాలా వెంట ఇళ్లు నిర్మించుకున్న పేద మధ్యతరగతి నివాసితుల ఇళ్లు తొలగించడం సబబు కాదన్నారు. ప్రజల హక్కులను కాపాడేందుకు తమ వంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ డివిజన్ బిజెపి ప్రధాన కార్యదర్శి తీగ విఠల్ రావు ముదిరాజ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు అమరేందర్, యువ మోర్చా అధ్యక్షులు ఆడెపు రమేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షులు జయరాం, గిరిజన మోర్చా అధ్యక్షులు రాజు నాయక్, సోషల్ మీడియా కన్వీనర్ అభిరామ్, కాలనీ సంఘం నేతలు కె. సత్తిరెడ్డి, రంగారెడ్డి, నగేష్, ఓబుల్ రెడ్డి, సమ్మయ్య, నారాయణ రెడ్డి, వెంకటేష్, సోమిరెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, సదానంద్, భూపతి, అంజయ్య, తిమ్మారెడ్డి, సత్యం తదితరులు పాల్గొన్నారు.

## కోహెడ రైతులకు న్యాయం చేయాలి : మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి



**తుర్కయంజాల్, జూన్ 6,ప్రభాతవార్త**
కోహెడలో ప్రతిపాదిత సమీకృత అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ నిర్మాణం చుట్టూ రాజకీయ వేడి మరింత పెరుగుతోంది. మార్కెట్ కోసం గతంలో ఎంపిక చేసిన అనుకూల భూమిని పక్కనబెట్టి, ప్రస్తుతం గుట్టలు, చెట్లు అధికంగా ఉన్న ప్రాంతంలో శంకుస్థాపన చేయడాన్ని మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్రంగా తప్పుబట్టారు.శనివారం ఆదిభట్ల సర్కిల్ తుర్కయంజాల్ డివిజన్ పరిధిలోని రొక్కం సత్తిరెడ్డి గార్డెన్‌లో నిర్వహించిన బీఆర్ఎస్ నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సర్వే నంబర్లు 507, 548లో అంతర్జాతీయ ఫ్రూట్ మార్కెట్ ఏర్పాటుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. మార్కెట్ నిర్మాణానికి అవసరమైన భూసేకరణ, భూమి చదును పనులు, డీపీఆర్ తయారీ వంటి ప్రక్రియలు పూర్తయ్యాయని, ఇందుకోసం రూ.300 కోట్ల నిధులు కూడా కేటాయించామని చెప్పారు.అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎలాంటి సమగ్ర పరిశీలన లేకుండానే మార్కెట్ స్థలాన్ని సర్వే నంబర్ 167/1కు మార్చిందని ఆరోపించారు. ఈ ప్రాంతం ఓఆర్ఆర్‌కు సమీపంలో ఉన్నప్పటికీ అక్కడ గుట్టలు, చెట్లు అధికంగా ఉండటంతో భారీ మార్కెట్ నిర్మాణానికి అనువుగా లేదని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని విధాలుగా సిద్ధంగా ఉన్న భూమిని వదిలిపెట్టి మరో ప్రాంతాన్ని ఎంపిక చేయడం వెనుక అసలు కారణాలు ఏమిటో ప్రభుత్వం ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.రైతుల సమస్యలను ప్రస్తావిస్తూ, కొత్తగా ఎంపిక చేసిన భూముల్లో సుమారు 120 మంది రైతులు వ్యవసాయం చేస్తున్నారని, వారికి ఇప్పటి వరకు తగిన నష్టపరిహారం అందలేదని అన్నారు. రైతులు తమ హక్కుల కోసం పోరాడితే వారిపై కేసులు నమోదు చేయడం, అరెస్టులు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్కెట్ శంకుస్థాపనకు ముందు వాస్తవ పరిస్థితులను తెలుసుకోవాలని సూచించిన ఆయన, రైతులకు పూర్తి నష్టపరిహారం చెల్లించిన తర్వాతే నిర్మాణ పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. కోహెడ సమీకృత ఫ్రూట్ మార్కెట్‌ను గతంలో నిర్ణయించిన సర్వే నంబర్లు 507, 548లోనే ఏర్పాటు చేసి రైతుల ప్రయోజనాలను కాపాడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి, కళ్యాణ్ నాయక్, సంజీవరెడ్డి, ఆనంద్ రెడ్డి, దశరథ్, గౌతమ్ రెడ్డి, మల్లేష్, చెన్నయ్య, సంపదీశ్వర్ రెడ్డి, మోహన్ గుప్తా, మేతరి అశోక్, గౌని వినోద్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## బడంగ్‌పేట్ సర్కిల్ టౌన్ ప్లానింగ్‌పై అవినీతి ఆరోపణలు

### -లంచాల కోసం ఇంటి అనుమతులు ఇవ్వడం లేదని బాధితుల ఆందోళన



బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న నాగరాజు

సరూర్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త: ఇళ్ళ నిర్మాణాల అనుమతులు ఇవ్వడానికి బడంగ్‌పేట్ సర్కిల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు లంచాలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపిస్తూ ఓ బిల్డర్ ఆందోళనకు దిగాడు. ఇటీవల అవినీతి ఆరోపణలపై ఎసిబి, విజిలెన్స్ అధికారుల విచారణ జరిగి డిప్యూటీ కమీషనర్ సరస్వతితో సహా మొత్తం పది మంది అధికారులు సస్పెండ్ అయిన విషయం మరువక ముందే అదే బడంగ్‌పేట్ సర్కిల్‌లో కార్యాలయం అధికారులపై అవినీతి ఆరోపణలు రావడం కలకలం రేపింది. సాక్షాత్తు టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ లంచం తీసుకున్నట్లు ఆడియో రికార్డు సైతం వైరల్ కావడం సంచలనమైంది. సర్కిల్ పరిధిలోని అల్మాస్ గూడకు చెందిన వల్లభ్‌దాస్ నాగరాజు టౌన్ ప్లానింగ్ అవినీతిపై గళం ఎత్తడం ద్వారా మరోసారి బడంగ్‌పేట్ కార్యాలయం సోషల్ మీడియాలో రచ్చ అయ్యింది. యువజన కాంగ్రెస్‌లో పని చేస్తూ సిఎం రేవంత్‌రెడ్డి అభిమానినైన తాను అల్మాస్‌గూడ పరిధిలో 100, 150 గజాల్లో చిన్న పాటి ఇళ్లు నిర్మించే తనకు ఇళ్ళ నిర్మాణాల అనుమతులు ఇవ్వడానికి టిపిఎస్ ఇబ్బందులు పెడుతున్నాడని నాగరాజు ఆరోపించారు. అనుమతి కోసం దరఖాస్తు చేసే వారి ఫైళ్ళను పరిశీలించి షార్ట్ ఫాల్ పేరుతో మొదట ఆందోళనకు గురి చేస్తారనీ ఆ తర్వాత ఫైల్‌కు బేరం కుదుర్చుకోవడం ఇక్కడ పరిపాటిగా మారిందని అన్నారు. తాను రూ.20 వేలు టిపిఎస్‌కు ఇచ్చాననీ అయితే నాలుగు ఇళ్ళ అనుమతులకు 80 వేలు డిమాండ్ చేశారని ఆయన ఆరోపించారు. ఇదేమని తాను అడిగితే సార్ ఒప్పుకోరని టిపిఎస్ బదులిచ్చాడని ఆయన వెల్లడించారు. కొన్ని నెలల క్రితం సర్కిల్‌లో అవినీతిపై విచారణ జరిగి అధికారులు సస్పెండ్ అయినా ఇక్కడ అవినీతి, అక్రమాలు మాత్రం ఆగలేదని నాగరాజు ఆరోపిస్తున్నారు. ఇక్కడి అవినీతిపై జోనల్ కమీషనర్ దృష్టికి తెచ్చాననీ సోమవారం జిహెచ్‌ఎంసి కమీషనర్‌కు ఫిర్యాదు చేస్తున్నట్లు నాగరాజు స్పష్టం చేశారు.

## బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా గాజుల స్వయం ప్రకాష్



గాజుల స్వయం ప్రకాష్‌కు నియామక పత్రాన్ని అందజేస్తున్న ఎంపి ఆర్.కృష్ణయ్య

**సైదాబాద్, జూన్ 6 ప్రభాతవార్త:** జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ కార్యదర్శిగా ఎల్‌బినగర్ నియోజకవర్గానికి చెందిన గాజుల స్వయం ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యులు ఆర్.కృష్ణయ్య ఉత్తర్వులు జారీ చేశారు. బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఆర్.అరుణ్ కుమార్ చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా స్వయం ప్రకాష్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి జాతీయ కార్యదర్శిగా నియమించినందుకు ఆర్.కృష్ణయ్య, ఆర్.అరుణ్ కుమార్‌లకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా బిసి సంక్షేమ సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తానని అన్నారు.

## నాగోల్ ఆర్టీవోగా కొండయ్య



**ఎల్.బి.నగర్, జూన్ 6 ప్రభాతవార్త:**
నాగోల్ ఆర్టీవోగా సి హెచ్.కొండయ్య బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ ఆర్టీఏ కార్యాలయంలో పని చేసిన కొండయ్య ప్రమోషన్‌పై నాగోల్ డ్రైవింగ్ టెస్ట్ ట్రాక్‌కు బదిలీ అయ్యారు. నాగోల్ ఇన్చార్జిగా ఉన్న అమర్‌నాథ్ మన్నెగూడ ఆర్టీఏ కార్యాల యానికి వెళ్లారు. శనివారం బాధ్యతలు స్వీకరించిన కొండయ్యను కార్యాలయం అధికారులు సిబ్బంది సత్కరించారు.

## రామంతాపూర్ పిఎస్ కాలనీలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన



రామంతాపూర్ పిఎస్ కాలనీలో సమస్యలు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి తదితరులు

**రామంతాపూర్, జూన్ 6 ప్రభాతవార్త :**
రామంతాపూర్ పిఎస్ కాలనీలో శనివారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా కాలనీలోని డ్రైనేజీ సమస్యలు, సిసి రోడ్ల నిర్మాణం, పార్కు అభివృద్ధి పనులు, సీసీ కెమెరాల ఏర్పాటు, విద్యుత్ సమస్యలు ఇతర అంశాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. కాలనీలో ప్రజలకు మౌళిక వసతుల కల్పించి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదే విధంగా అంతర్గత రహదారుల అభివృద్ధి కోసం సీసీ రోడ్ల పనులను వేగవంతం చేయాలని సూచించారు. ప్రజలకు ఆహ్లాదకర వాతావరణం కల్పించేలా పార్కును ఆధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేయడంతో పాటు, కాలనీలో భద్రతను పెంపొందించేందుకు కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని తెలిపారు. వీధి దీపాల కోసం అవసరమైన పోల్స్ ఏర్పాటుపై కూడా సమగ్ర ప్రణాళికతో ముందుకు వెళ్లాలని అధికారులకు సూచించారు. ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, పీఎస్ కాలనీ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ పార్టీ సీనియర్ నేత గంధం నాగేశ్వర్‌రావు, పలువురు కాలనీ సంఘం నేతలు పాల్గొన్నారు.

## ఉప్పల్‌లో సేఫ్టీ బెల్ట్ లేకుండా విద్యుత్ కార్మికులతో పనులు





ఉప్పల్ నల్ల చెరువు వద్ద సేఫ్టీ బెల్టు లేకుండా విద్యుత్ స్థంభాలపై పనిచేస్తున్న కార్మికులు దృశ్యం.

**ఉప్పల్, జూన్ 6 ప్రభాతవార్త :**
ఉప్పల్ ప్రధాన రహదారిలో విద్యుత్ స్థంభాల తొలగింపు పనులలో కాంట్రాక్టర్లు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ కార్మికులతో పనులు చేయిస్తున్నారు. ఉప్పల్ నల్ల చెరువు నుంచి రింగ్‌రోడ్ వరకు ప్రధాన రహదారి విస్తరణ సందర్భంగా రోడ్డుపై ఉన్న విద్యుత్ స్థంభాలను తొలగించి పక్కకు మార్చుతున్నారు. ఇదే క్రమంలో ఉప్పల్ నల్ల చెరువు వద్ద శుక్రవారం కార్మికులు ఎటువంటి సేఫ్టీ బెల్టులు లేకుండా పనిచేస్తూ రహదారిపై కనిపించారు. దీంతో రహదారి మీదుగా వెళుతున్న స్థానికులు వీటిని ఫోటోలు తీసి సోషల్ మీడియాలో పెట్టారు. బిఎల్‌నగర్, వాసవినగర్‌లో నిర్మిస్తున్న కొత్త సబ్ స్టేషన్‌ల కోసం ఫీడర్ పనులు చేపడుతున్నారని, విద్యుత్ తీగలు ఏర్పాటు చేసే క్రమంలో కార్మికులు నిర్లక్ష్యంగా వ్యవహరించారని అధికారులు పేర్కొంటున్నారు. కాగా పనులు జరిగే సమయంలో అక్కడే ఉండి పనులు చేయించాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై పలు విమర్శలు వస్తున్నారు. కొద్ది రోజుల క్రితం చుడీబజార్‌లో విద్యుత్ స్థంభంపై నుంచి కింద పడి ఒక ఆర్టిజన్ మృతి చెందిన సంఘటన మరువక ముందే అధికారులు నిర్లక్ష్యంగా పనులు చేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఉన్నతాధికారులు దీనిపై తగు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## జలమండలిలో డిఓపిగా బాధ్యతలు చేపట్టిన ప్రభు



ప్రభునును సన్మానిస్తున్న పోల్కం శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూన్ 6, ప్రభాతవార్త:**
జలమండలి విభాగంలో డిఓపి గా బాధ్యతలు చేపట్టిన ప్రభును తెలంగాణ జలమండలి కాంట్రాక్టర్ అసోసియేషన్ జేఏసీ మీడియా ఇన్చార్జ్ సెక్రెటరీ పోల్కం శ్రీనివాస్ మేరు ఆధ్వర్యంలో పోల్కం వినయ్ రాజ్, వెన్ను శివకుమార్, చందర్, విక్రమ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించి అభినందనలు తెలియజేశారు. అదేవిధంగా పలువురు కాంట్రాక్టర్లు సన్మానించి అభినందనలు తెలియజేశారు.

## ప్రజల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి : భోనగిరి చంద్రశేఖర్



టిపిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను సన్మానిస్తున్న భోనగిరి చంద్రశేఖర్, చిత్రంలో వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తదితరులు

**మలక్ పేట, జూన్ 6, ప్రభాతవార్త:**
కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం ఎంతో కృషి చేస్తుందని టిపిసిసి మాజీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ భోనగిరి చం ద్రశేఖర్ పేర్కొన్నారు. మల క్ పేట్ నుంచి భోనగిరి చంద్రశేఖర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో గాంధీ భవన్‌కు తరలి వెళ్లి హైదరాబాద్ నగర వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కోట్ల శ్రీనివాస్ తో కలిసి టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ ను మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సన్మానించి అభినం దనలు తెలియజేశారు. ఈ సందర్భంగా బోనగిరి చంద్రశేఖ ర్ మాట్లాడుతూ గ్రేటర్ లో కాంగ్రెస్ పార్టీ ని మరింత బలోపేతం చేయడానికి కృషి చేస్తామని తెలిపా రు. రానున్న గ్రేటర్ ఎన్నికలలో కాంగ్రెస్ జెండాను ఎగురవేస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్ర మంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జాతీయ బిసి కమిషన్ మాజీ మెంబర్‌ను కలిసిన బిజెపి నేతలు



తల్లోజు ఆచారిని సన్మానించిన మీర్‌పేట్ బిజెపి అధ్యక్షుడు పసునూరి బిక్షపతిచారి

**సరూర్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త:** జాతీయ బిసి కమీషన్ మాజీ మెంబర్, బిజెపి సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారిని మీర్‌పేట్‌కు చెందిన బిజెపి సెక్టార్-1 అధ్యక్షుడు, మాజీ కార్పొరేటర్ పసునూరి బిక్షపతిచారి ఘనంగా సన్మానించారు. ఆచారి పుట్టిన రోజు సందర్భంగా పలువురు నాయకులతో కలిసి ఆయనను పూలమాలతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ ఎ.భీమ్‌రాజ్, కలకొండ శ్రీనివాసచారి, మురుపోజు శివకుమారచారి, కుమార్, లక్ష్మణచారి, అజయ్ చారిలతో పాటు పలువురు పాల్గొన్నారు.

## సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపనకు తరలివెళ్లిన హస్తం నేతలు



కార్యక్రమానికి తరలివెళ్తున్న బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తదితరులు

**సరూర్‌నగర్, జూన్ 6 ప్రభాతవార్త:**
అబ్దుల్లాపూర్ మండలంలోని కోహెడలో రాష్ట్ర ప్రభుత్వం రూ.2284 కోట్ల అంచనా వ్యయంతో ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్న అంతర్జాతీయ సమీకృత పండ్ల మార్కెట్ శంకుస్థాపన కార్యక్రమానికి మహేశ్వరం నియోజకవర్గం లోని బడంగ్‌పేట్ సర్కిల్ నుండి ఏఐసిసి విచార్ విభాగ్ కో-ఆర్డినేటర్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ నాయకుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పలువురు నాయకులు, కార్యకర్తలు తరలివెళ్ళారు. సిఎం రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా జరిగిన శంకుస్థాపన కార్యమ్రంలో వారంతా పాల్గొన్నారు.

## భర్తతో గొడవ.. ఇంటి నుంచి వెళ్లిపోయిన మహిళ



**మల్కాజిగిరి, జూన్ 6 (ప్రభాతవార్త):**
భర్తతో జరిగిన చిన్నపాటి వివాదం మనస్థాపానికి దారితీయడంతో ఓ మహిళ ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటన నేరేడ్మెట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లాకు చెందిన శ్రీలక్ష్మి ఇటీవల సెలవుల నిమిత్తం ఓల్డ్ సఫిల్‌గూడలో నివాసం ఉంటున్న తన పెద్ద కుమార్తె ప్రత్యూష ఇంటికి వచ్చింది. ఈ క్రమంలో శనివారం ఉదయం తన భర్త మోహన్‌రావుతో స్వల్ప వాగ్వాదం జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శ్రీలక్ష్మి ఇంట్లో ఉన్న వారికి చెప్పకుండా బయటకు వెళ్లిపోయింది.కొంతసేపటి తర్వాత కుటుంబ సభ్యులు గమనించి పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో పోలీసులను ఆశ్రయించారు. ఫిర్యాదు మేరకు నేరేడ్మెట్ పోలీసులు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మహిళ ఆచూకీ కోసం గాలింపు చర్యలు కొనసాగిస్తున్నట్లు పోలీసులు తెలిపారు